నమస్తే తెలంగాణ

జనగామ

10 | వరంగల్, గురువారం 6 ఫిబ్రవరి 2025 | JANAGAON




## కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చల్లా

పరకాల, ఫిబ్రవరి 5 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేసీఆర్‌కు వివరించారు. అలాగే శాసన మండలిలో బీఆర్‌ఎస్ విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## కేటీఆర్‌ను కలిసిన సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్ : శాసన మండలిలో బీఆర్‌ఎస్ విప్‌గా నియమించినందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మన్యు పాట్నీ, బోడ శ్రీను తదితరులున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కార్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులకు చెప్పల దండలే స్వాగతం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం, ఫిబ్రవరి 5: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభ పెట్టి బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఎద్దేవా చేశారు. పార్టీ పరంగా 42 శాతం సీట్లిస్తామని కాంగ్రెస్ పార్టీ నయా మోసానికి తెరలేపిందని అన్నారు. ఇతర పార్టీలు కూడా బీసీలకు 42 శాతం సీట్లివ్వాలని సీఎం చాలెంజ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. బీసీ రిజర్వేషన్లు అనేవి కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదని, చట్టబద్ధత కూడిన రిజర్వేషన్లను అమలు చేస్తే అన్నింట్లో బీసీలకు రిజర్వేషన్లు అమలవుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా మోసం చేసిందో అదే విధంగా బీసీ రిజర్వేషన్లలోనూ కూడా చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ఉన్న విశ్వసనీయత బీసీ కులగణనకు లేదన్నారు. అది తప్పుల తడకగా ఉందన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉన్న ఎస్కేఎస్ సర్వే వివరాలను అసెంబ్లీలో బీఆర్‌ఎస్ నాయకులు బయటపెట్టారని అన్నారు. కానీ గంటలోపే ఆ సర్వే వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి తొలగించిన గజదొంగ రేవంత్‌రెడ్డి అన్నారు. వెబ్‌సైట్ నుంచి ఎందుకు తొలగించారని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయని అన్నారు. ముందుగా ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తారా లేక సర్పంచ్ ఎన్నికలా అనేది ప్రభుత్వం స్పష్టతనివ్వాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే రైతులకు బకాయి పడ్డ ఎకరాకు రూ.17,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డుల జాబితా తప్పుల తడకగా ఉందని అన్నారు. నా పేరే రేషన్‌కార్డు దారుల్లో ఉందని అన్నారు. రైతులను అన్నింట్లో నట్టేటా ముంచిన రేవంత్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లోకి వస్తే గ్రామపొలిమేరల్లోనే చెప్పుల దండలు స్వాగతం పలుకుతాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పాలన చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బుధరావుపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు



బీసీల వాటాపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని వరంగల్ తహసీల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

# భగ్గుమన్న బీసీలు

**కులగణన సర్వే తప్పుల తడక అంటూ ఆగ్రహం**

**పెరగాల్సిన జనాభా ఎలా తగ్గిందంటూ మండిపాటు**

- ప్రభుత్వం అగ్రకులాలకు తలొగ్గిందని ఆరోపణ
- మరోసారి పారదర్శకంగా సర్వే చేపట్టాలని డిమాండ్
- లేదంటే పోరాటానికి సిద్ధమంటూ హెచ్చరిక

*కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన కులగణన లెక్కలపై బీసీలు భగ్గుమన్నారు. సర్వే అంతా తప్పుల తడకగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు, ఇప్పటికి చాలా వ్యత్యాసముందని మండిపడ్డారు. పెరగాల్సిన జనాభా ఎలా తగ్గిందంటూ ప్రశ్నిస్తున్నారు. అగ్ర కులాలకు కేటాయించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకే కుట్రలకు తెరలేపారని, ఓసీలకు తలొగ్గిన ప్రభుత్వం వారికి అనుకూలంగా సర్వే చేపట్టిందని ఆరోపించారు. బీసీల సంఖ్య ఎందుకు తగ్గింది? ఓసీల జనాభా ఎలా పెరిగింది? అనే లెక్కలను ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంత చేస్తున్నా బీసీల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. మళ్లీ పారదర్శకంగా కులగణన చేపట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామంటూ హెచ్చరించారు.* -నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 5




హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

### కావాలనే తక్కువ చూపారు



ఎల్కతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే బీసీ జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేసింది. సర్వే పూర్తిగా తప్పుల తడకగా చేసినట్లు జనాభా నిష్పత్తిని చూస్తే తెలుస్తున్నది. గతంలో కన్నా ఇప్పుడు బీసీలు ఎలా తగ్గుతారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల లెక్క పక్కాగా తేలింది. ఎట్టి పరిస్థితుల్లో ఈ కుల గణనను ఒప్పుకోం. వెంటనే ప్రభుత్వం మళ్లీ పారదర్శకంగా బీసీల కులగణన చేసి దానికి చట్టబద్ధత కల్పించాలి. అలాగే 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.

*– శ్రీపతి రవీందర్‌గౌడ్, సొసైటీ చైర్మన్, బీసీ సంఘం జిల్లా నాయకుడు*

### బీసీలను అణచివేసేందుకు యత్నం



నల్లబెల్లి : రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను అణగదొక్కేందుకు రేవంత్ సర్కారు యత్నిస్తున్నది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం బీసీలకు అన్యాయం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు, ఇప్పటి సర్వేకు పొంతనే లేదు. బీసీ ఓట్లతో గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వారికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు. కనీసం మంత్రిగా పనిచేయని రేవంత్‌కు సీఎం పదవి ఇస్తే అనుభవం లేంది ఏం చేస్తడు. ఇలాంటి అవకాశం మల్లా వస్తదా ఏంది? వెలుగు ఉన్నప్పుడే ఇళ్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా అభివృద్ధి పేరుతో తెచ్చిన అప్పులు తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా పంచుకుంటుండ్రు. ఇట్లాంటి పనులు మానుకొని స్థానిక ఎన్నికల్లో బీసీలకు 56 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. *– చెట్టుపల్లి దామోదర్‌రావు, ఆరె కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నల్లబెల్లి*

## 56 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- బీసీ హక్కుల సాధన సమితి నాయకుల డిమాండ్
- మహబూబాబాద్, హనుమకొండ కలెక్టరేట్ల ఎదుట ధర్నా

మహబూబాబాద్ రూరల్/వరంగల్, ఫిబ్రవరి 5 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 56 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్, రాష్ట్ర ఉప కార్యదర్శి నేదునూరి రాజమౌళి అన్నారు. బుధవారం మహబూబాబాద్, హనుమకొండ కలెక్టరేట్ల ఎదుట బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారని, రాబోవు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో బీసీలకు 56 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. దేశ జనగణనలో కుల గణన చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీలకు సబ్సిడీ రుణాలు, బీసీ అట్రాసిటీ చట్టం, బీసీ కింద రూ. 25 లక్షలు అందించి, బీసీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని సదానందం, నాయకులు గుంటి రాజేందర్, ఏదునూరి వెంకట్రాజం, కేడల ప్రసాద్, దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, మోడెం రాజేందర్, నాంపెల్లి లక్ష్మయ్య, నేదునూరి శ్రీనివాస్, చేరాలు అంకుషావలీ, రాంచందర్, వెలుగు శ్రావణ్, ప్రవీణ్, అశోక్, శ్రీనాథ్, రమేశ్, వికాస్, సత్యం, మురళీ, రాజు పాల్గొన్నారు. అలాగే బీసీల వాటాపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ధర్నా చేసి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

# సీఐని సస్పెండ్ చేయాల్సిందే..

**కోర్టు ఎదుట నిరసన తెలిపిన న్యాయవాదులు**

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 5 : న్యాయవాది గంధం శివపై దాడి చేసిన సీఐ సీతారెడ్డిని సస్పెండ్ చేయాల్సిందేనని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని విధులు బహిష్కరించి కోర్టు గేట్లు మూసేసి నిరసన తెలిపారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పోలీసుల తీరును తీవ్ర కంఠంతో ఖండించారు. పోలీస్ సిబ్బంది వైపు నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో గురువారం కూడా విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించాలని న్యాయవాదులు తీర్మానించుకున్నారు. పోలీస్ సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టేదాకా కోర్టు సేవలను నడవనివ్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్ గౌడ్ హనుమకొండ అధ్యక్షుడు రమేశ్‌బాబు, బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్, బైరపాక జయాకర్, కార్యదర్శి ముదస్సిర్, లాడే రమేశ్, సీనియర్ న్యాయవాదులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, అంబరీష్‌రావు, గుడిమల్ల రవి కుమార్, షేక్ అబ్దుల్ నబీ, రాచకొండ ప్రవీణ్ కుమార్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.




కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

### అగ్ర కులాలకు తలొగ్గిన కాంగ్రెస్



లింగాలఘనపురం : కుట్రల కాంగ్రెస్ తన నైజాన్ని కులగణన పేర బయట పెట్టుకుంది. సమాజంలో 60 శాతం బడుగులుంటే ఓసీల సంఖ్యను పెంచింది. ఈ లెక్కల్లో అగ్రవర్ణాలదే పైచేయి అయ్యింది. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం సరిగా పాలన చేయలేదు. కేసీఆర్ పాలనలో బీసీలకు సముచిత స్థానం దక్కింది. బడుగు, బలహీన వర్గాల సంఖ్య ఎక్కువగా ఉన్నా రాజ్యాధికారం మాత్రం ఎప్పుడూ అగ్రకులాలకే దక్కుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అగ్ర కులాలకు తలొగ్గి వారికి అనుకూలంగా సర్వే చేయించింది. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.

*– సేవెల్లి సంపత్, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనగామ జిల్లా*

### సమగ్రంగా లెక్కలు తీయాలే..



జనగామ రూరల్ : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు నష్టం జరుగుతున్నది. వాటిని అమలు చేసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నది. బీఆర్‌ఎస్ హయాంలో 52 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ 46 శాతంగా చూపెడుతున్నది. ఓసీ జనాభాను ఎక్కువగా, బీసీలను తక్కువగా చూపెట్టడం పెద్దకుట్ర. పైగా బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. పార్టీల పరంగా కాకుండా రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇవ్వాలి. బీసీ జనాభా ఏ కారణంతో తగ్గిందో ప్రజలకు చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్రంగా లెక్కలు తీసి ఎవరెవరు ఎంత శాతమున్నారో ప్రకటించాలి.

*– బక్క నాగరాజు యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, జనగామ జిల్లా*

### బీసీలకు అన్యాయం



ములుగు రూరల్ : కులగణనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఈ సర్వే పూర్తిగా అసమగ్రంగా, బీసీల వాస్తవ జనాభాను తక్కువగా చూపే విధంగా రూపొందించబడింది. బీసీలను సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బలహీనంగా చూపించేలా ఈ గణన జరిగింది. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి పునః సమీక్ష చేపట్టాలి. నిపుణుల ఆధ్వర్యంలో మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలి. బీసీలకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తాం. హక్కులను కాపడే దిశగా అన్ని రాజకీయ, సామాజిక వర్గాలతో కలిసి ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నాం.

*– ఆచార్య సకినాల జీవన్‌చంద్ర, వ్యవస్థాపక అధ్యక్షుడు, నేషనల్ ఫోరం ఫర్ గుడ్ సొసైటీ, ములుగు*

## కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా దక్కేనా?

**సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటుతో చిగురిస్తున్న ఆశలు**




కాజీపేట, ఫిబ్రవరి 5 : కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ విశాఖపట్నంను రైల్వే డివిజన్, సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌గా ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఉత్తర, దక్షిణ భారతదేశానికి ముఖ్య కూడలిగా ఉన్న కాజీపేట జంక్షన్‌కు రైల్వే డివిజన్ హోదా దక్కుతుందనే ఆశలు ఈ ప్రాంత ప్రజల్లో చిగురిస్తున్నాయి. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో పలు రైల్వే డివిజన్లలోని ఎల్లలు, హద్దులు మారనుండడంతో తాజాగా సికింద్రాబాద్ రైల్వే డివిజన్ విస్తీర్ణం మరింత పెరుగనున్నది. గతంలోనే కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట నుంచి మాణిఘర్, పెద్దపల్లి నుంచి నిజామాబాద్, కాజీపేట–కొండపల్లి, డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్డు, మణుగూరు, భద్రాచలం రోడ్డు నుంచి సత్తుపల్లి వరకు రైల్వే విస్తీర్ణం ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు విశాఖ సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి వెల్లడంతో అన్ని అర్హతలున్న కాజీపేట రైల్వే డివిజన్ హోదాకు నోచుకుంటుందని, తమ చిరకాల వాంఛ తీరుతుందని ఇక్కడి ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మహా కుంభమేళాకు వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లు**

కాజీపేట, ఫిబ్రవరి 5 : మహా కుంభమేళాను పురస్కరించుకుని వరంగల్ స్టేషన్ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లను మచిలీపట్నం–దానాపూర్–మచిలీపట్నం మధ్య నడుస్తుందన్నారు. ఈ నెల 8, 16వ తేదీన నంబర్ 07113తో మచిలీపట్నం రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 11.00కు బయలుదేరే రైలు మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరిగి ఈ నెల 10, 18 తేదీల్లో 07114 నంబర్‌తో దానాపూర్‌లో మధ్యాహ్నం 3.15కు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 3.00 గంటలకు మచిలీపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైళ్లు ఉమ్మడి జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్ స్టేషన్లలో ఆగుతాయని, వీటికి కేవలం 3 ఏసీ బోగీలు మాత్రమే ఉంటాయన్నారు. రిజర్వేషన్ ప్రక్రియ మొదలైందని, కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## ఘనంగా గుడి, మండమెలిగే పండుగ

**మేడారంలో మినీ జాతర ముగిసే వరకు నిత్యపూజలు**



ఆలయంలో పూజలు చేస్తున్న గిరిజన పూజారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 5 : మేడారంలో గుడిమెలిగే పండగను బుధవారం సమ్మక్క–సారలమ్మ పూజారులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 15 వరకు అమ్మవార్ల మినీ జాతర జరగనుంది. దీనికి వారం రోజుల ముందు నిర్వహించే ఈ పండుగతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ పూజారులు కాక సారయ్య, కాక కిరణ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలోని గుట్టపైకి వెళ్లి గడ్డిని సేకరించారు. అనంతరం సమ్మక్క పూజామందిరం వద్దకు చేరుకొని గుడిపై వేసిన అనంతరం ఆడపడుచులు పూజామందిరాలలోని గద్దెలను మట్టితో అలికి ముగ్గులు వేశారు. అమ్మవారి పూజాసామగ్రిని సమ్మక్క పూజారి కొక్కెర క్రిష్ణయ్య భద్రపరిచిన స్థలం నుంచి తీసుకొచ్చి శుద్ధి చేశారు. అమ్మవార్ల మినీ జాతర ముగిసే వరకు పూజారులు, వారి కుటుంబాలు అత్యంత నియమనిష్టలతో నిత్య పూజలు నిర్వహించనున్నారు. అలాగే సమ్మక్క పుట్టిన బయ్యక్కపేటలో చందా వంశీయులు బుధవారం గుడిమెలిగే పండుగను నిర్వహించారు. ఉదయమే అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి తల్లి కొలువైన గుడిని శుద్ధి చేసి అలుకుపూతలు చేసిన అనంతరం గడ్డిని గుడిపై వేసి పూజలు చేశారు.

**దొడ్ల, కొండాయిలో మండమెలిగే..**

ఏటూరునాగారం : మండలంలోని దొడ్ల, కొండాయి గ్రామాల్లో బుధవారం గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ గుడిలో మండమెలిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిని, ఆవరణను నీటితో శుద్ధి చేసి ముగ్గులు వేశారు. ప్రవేశ ద్వారం వద్ద మామిడి తోరణాలు కట్టారు. గ్రామంలో శారలమ్మ గుడిని అలంకరించడంతో పాటు పూజా సామగ్రిని శుద్ధి చేశారు. ఆయా కార్యక్రమాల్లో పూజారులు వెంకటేశ్వర్లు, గోవర్ధన్, దెబ్బగట్ల గోవర్ధన్, పరుగు రాజారాం తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : గద్దెను అలంకరిస్తున్న పూజారులు

**గట్టమ్మకు ఎదురు పిల్ల పండుగ**

ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని ఆదిదేవత గట్టమ్మ తల్లికి బుధవారం ఎదురుపిల్ల పండుగను ఆదివాసీ నాయకపోడు పూజారులు, కులస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు నెత్తిన పెట్టుకొని నృత్యాలు, లక్ష్మీదేవరల ఆటలు, పాటలతో భారీ ర్యాలీగా గట్టమ్మ వద్దకు చేరుకున్నారు. ప్రధాన పూజారి సదయ్య, కులస్తులు బోనాన్ని సమర్పించి లక్ష్మీదేవర, పోతరాజును ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎదురుపిల్లను గట్టమ్మ తల్లికి సమర్పించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆపద రాకుండా చల్లగా చూడాలని వేడుకున్నారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

*• నాడు తండ్రి.. నేడు కొడుకు*

## చలివాగులో మునిగి విద్యార్థి మృతి

- హాస్టల్ నుంచి ఈతకు వెళ్లి మృత్యువాత
- స్వగ్రామం పంగిడిపల్లిలో విషాదం





భవాని, సంతోష్ (ఫైల్)

టేకుమట్ల/మొగుళ్లపల్లి, ఫిబ్రవరి5: చలివాగు ఆ తండ్రి కొడుకుల పాలిట శాపంగా మారింది. నాడు తండ్రి చలివాగులో మునిగిన తన కొడుకుని కాపాడి అతడు మృతి చెందాడు. అదే కొడుకు బుధవారం చలివాగులో మళ్లీ మునిగాడు కానీ కాపాడేందుకు తండ్రి లేకపోవడంతో తుది శ్వాస విడిచాడు. వివరాలిలా ఉన్నాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన పురాణం భవాని చిన్న కుమారుడు సంతోష్ సెలవులకు ఇంటికి రాగా సెప్టెంబర్ 9, 2023న ఆశిరెడ్డిపల్లి శివారులో చలివాగులో చేపలు పట్టేందుకు తండ్రి, కొడుకు వెళ్లారు. ఈ క్రమంలో సంతోష్ చలివాగులో పడి కొట్టుకుపోతుంటే భవాని కాపాడేందుకు అందులోకి దూకి కొంతదూరం లాక్కొచ్చాడు. ప్రవాహం వేగంగా ఉండడంతో మరికొంత మంది వెళ్లి సంతోష్‌ను ఒడ్డుకు చేర్చగా భవాని మాత్రం శ్వాస ఆడక వాగులో మునిగి చనిపోయాడు. అప్పుడు ప్రాణాలతో బయటపడిన సంతోష్ మొగుళ్లపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ, స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా వసతి గృహంలో ఉంటున్నాడు. బుధవారం ఉదయం తన స్నేహితుడితో కలిసి ఈత కొట్టడానికి నవాబుపేట–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య గల చలివాగులోకి లోతు తెలియక ఒక్కసారిగా మునిగిపోయాడు. స్నేహితుడు కాపాడేందుకు ప్రయత్నించినా కుదరకపోవడంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు గమనించి బయటికి తీయగా అప్పటికే సంతోష్ మృతి చెందాడు. తండ్రి, కొడుకు మృతి చెందడంపై గ్రామస్తులు అయ్యో పాపం చలివాగు ఇద్దరిని పొట్టన పెట్టుకుందని వాపోయారు. ఘటనా స్థలానికి జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి సునీత, తహసీల్దార్ సునీత చేరుకున్నారు.

**వసతి గృహం ఎదుట మృతదేహంతో ధర్నా..**

వసతి గృహం అధికారుల నిర్లక్ష్యంతో తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపిస్తూ విద్యార్థి మృతదేహంతో హాస్టల్ ఎదుట తల్లి, బంధువు లు ధర్నా చేశారు. చిట్యాల సీఐ మల్లేశ్, ఎస్ఐ అశోక్ వారికి సర్ది చెప్పినా వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగింది. ఎట్టకేలకు సీఐ హామీతో ధర్నా విరమించారు.